సాక్షి తిరుపతి

బుధవారం । 6 । ఆగస్టు । 2025



వేతనాలు చెల్లించలేని స్థితిలో..

కూటమి సర్కారు ఉద్యోగులు, పింఛనర్లకు వేతనాలు, పింఛన్లు చెల్లించలేని స్థితిలో ఉందని ఏపీజీఈఏ నేతలు దుయ్యబట్టారు. - 10లో



కూటమి చెలగాటం..

శెట్టిపల్లి భూముల విషయంలో కూటమి సర్కారు ఆడుతున్న చెలగాటం రైతులు, కొనుగోలుదారులకు ప్రాణసంకటంగా మారింది. - 10లో



తల్లిపాలలో పోషకాలు మెండు

తల్లిపాలలో పోషకాలు మెండుగా ఉన్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

స్విమ్స్ పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు పీజీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఒక ప్రకటనతో తెలిపారు. ఎమ్మెస్సీ నర్సింగ్, ఎంపీటీ, ఎమ్మెస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్‌లో డయాలసిస్ టెక్నాలజీ, ఎమ్మెస్సీ క్లినికల్ వైరాలజీ, ఎమ్మెస్సీ క్లినికల్ సైకాలజీ, స్పెషలైజ్డ్ నర్సింగ్ కోర్సులలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు, మరిన్ని వివరాల కోసం స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పట్టనుంది. 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు 69,928 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 29,297 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు.

స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధంకండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 15వ తేదీన స్వాతంత్య్ర దిన వేడుకలు నిర్వహించడానికి అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులుతో కలసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమ ఏర్పాట్ల పూర్తి పర్యవేక్షణ తిరుపతి ఆర్డీఓ చేయాలని సూచించారు. పెరేడ్ గ్రౌండ్ నందు బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణను, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, తుడా వారు వివిధ అంశాల సమన్వయంతో ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

రూపాయికే బీఎస్‌ఎన్‌ఎల్ ఆజాదికా ఆఫర్

తిరుపతి ఎడ్యుకేషన్ : స్వాతంత్య్ర దినోత్సవ మాసాన్ని పురస్కరించుకుని బీఎస్‌ఎన్‌ఎల్ సరికొత్తగా ఆజాదికా ఆఫర్‌ను ప్రకటించినట్లు ఆ సంస్థ జీఎం అమరేంద్రరెడ్డి, డిప్యూటీ జీఎం ఎస్.వెంకోబరావు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఆఫర్‌లో భాగంగా ఆగస్టు ఒకటి నుంచి 31వ తేదీలోపు కొత్తగా సిమ్ తీసుకునే వారికి రూపాయికే అందించడంతోపాటుగా 30 రోజుల వరకు అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు వంద ఎస్‌ఎంఎస్‌లు, అలాగే రోజుకు 4జీ, 2జీబీ డేటాను ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. ఈ నెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు కొత్తగా సిమ్ తీసుకునే వారితో పాటు ఇతర ఆపరేటర్ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్‌కు పోర్ట్ చేసుకునే వారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు. వినియోగదారులు సమీపంలోని బీఎస్‌ఎన్‌ఎల్ సేవా కేంద్రం, రిటైలర్‌ను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న జీయర్ స్వాములు, వేద పండితులు

పవిత్రోత్సవం

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. వేద పండితులు పంచసూక్తాలను పఠించి పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

– తిరుమల

పట్టు వస్త్రాల సమర్పణ



ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి ఆర్కే రోజా పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు మంగళవాయిద్యాలు, బాణ సంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా వచ్చి సారె అందజేశారు.

–పుత్తూరు

సాంకేతిక పథం..
కూలీలకు హితం

పారదర్శకతే పరమావధి. ఉపాధి హామీ పథకంలో అవినీతి అంతమొందించడమే లక్ష్యం. క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవడమే ధ్యేయం. అవకతవకలకు చెక్ పెట్టి ఉపాధికి ఊపిరిలూదడం.. కూలీల మోముల్లో ఉషస్సులు నింపడమే ఆశయం.. నిధులు పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట వేయడమే ఉద్దేశం.. ఉపాధి ఫలాలు అర్హులకు అందించడమే సంకల్పంగా కేంద్రం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే ఉపాధి కూలీలకు మరో రెండు రోజుల్లో ముఖ ఆధారిత హాజరు విధానం ప్రారంభించనుంది. దీంతో కూటమి నేతల అక్రమాలకు గండి పడి.. కూలీలకు మేలు జరగనుంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో మొత్తం జాబ్ కార్డులున్న కుటుంబాల సంఖ్య	2.18 లక్షలు
జిల్లాలో మొత్తం యాక్టివ్ కూలీల సంఖ్య	3.50 లక్షల మంది
ప్రస్తుతం పనులకు చేస్తున్న కూలీల సంఖ్య	50,320 మంది

ఇక ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

- కేంద్ర ప్రభుత్వం కొత్త ఆలోచన
- కొత్తగా రూపొందించిన యాప్
- రోజుకు రెండు పర్యాయాలు ఫొటో తీయాల్సిందే
- క్షేత్ర సహాయకుల గుండెల్లో గుబులు



ఉపాధి కూలీలకు కొత్త విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిల్లకూరు: ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం కొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఈ నెల 8 నుంచి సిద్ధం అవుతోంది. ఇందుకు గానుకొత్తగా ఒక యాప్‌ను రూపొందించి అందులో ప్రతి జాబ్ కార్డు ఉన్న వారి ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో ఆ కూలీ పనికి వచ్చి హాజరు వేయించుకున్న అనంతరం ఫొటో (ఐరిష్) తీసుకునే సమయంలో అతను కాక పోతే కూలీ నగదు చెల్లుబాటు చేసేందుకు వీలు లేకుండా పోతుంది. ఈ యాప్‌ను ఈ నెల 8 నుంచి క్షేత్రస్థాయిలో ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో మండల స్థాయిలో ఉండే ఉపాధి అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, ఒక్కరోజు శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉపాధి ఏపీఓలు పని జరిగే ప్రాంతాల్లో కూలీలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఇలా కొత్త యాప్ రావడంతో తాము అనుకున్న టార్గెట్‌ను అందుకోలేక పోతామనే భయం కూటమి నేతల్లో కలుగుతుంది.

అత్యాధునిక సాంకేతికతతో..

కొత్త మస్టర్ విధానంలో అత్యాధునిక సాంకేతికతను తీసుకువచ్చి, గ్రామ, మండల, జిల్లాలోని భౌగోళిక పరిస్థితిని అంచనా వేసేలా రూపొందించారు. ఇప్పటికే నమోదైన కూలీల వివరాలు, జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, కూలీల తాజా ఫొటో, ఈకేవైసీ చేయించాలి. రెండు పర్యాయాలు ఫొటో తీసే సమయంలో వీటిలో ఏ ఒక్కటి సరిపోలక పోయినా నమోదు కాదు. ఇలాంటి సాంకేతికత వస్తుండడంతో పాటుగా ఉపాధి ద్వారా గ్రామాల్లో గతంలో, ప్రస్తుతం జరిగిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఉపాధి ఏపీఓలు ప్రత్యేక యాప్ ద్వారా రోజుకు రెండు గ్రామాల్లో పనులు ఫొటోలు అప్‌లోడ్ చేయల్సి ఉంది. దీంతో అటు ఉపాధి సిబ్బందికి ఇటు కూటమి నాయకుల ఉపాధి (జేబులు నింపుకునే విధానానికి)కి పెద్ద గండి పడినట్లు అవుతుంది.

హాజరు ఇలా..

ముఖ ఆధారిత హాజరు తీసుకునే విధానంలో కొత్త పద్ధతులను అవలంబించేలా మార్గ దర్శకాలను కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చింది. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి, తమ వారిని నియమించుకున్న కూటమి నాయకులకు ఈ కొత్త పద్ధతి అమలులోకి వచ్చిన తరువాత వెలక్కాయ గొంతులో చిక్కుకున్న పరిస్థితి ఏర్పడుతుంది. ముఖఆధారిత హాజరు విధానంలో భాగంగా కూలీల ఫొటోలను మొబైల్ ఫోన్‌లో తీసుకుని జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్‌ఎంఎంఎస్)కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఫీల్డ్ అసిస్టెంట్లు, పనిచేసే కూలీల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఒకరి తరుపున మరొకరు హాజరైనట్లు చూపితే ఆన్‌లైన్‌లో హాజరు తీసుకోదు.



ముఖ ఆధారిత హాజరు తీస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్

ఫొటో అప్‌లోడ్‌కు కనీసం నాలుగు గంటలు

ఉపాధి పని జరిగే చోట ప్రస్తుతం కూలీలు చేసిన పనిని కొలతల్లో మాయాజాలం చూపించేలా కూటమి నాయకులు ఒత్తిడి తెచ్చి, ఉపాధి సిబ్బందితో ఒకటికి నాలుగు మస్టర్లను వేసుకుని జేబులు నింపుకునే వారు. ప్రస్తుతం కేంద్ర ప్రవేశపెట్టిన కొత్త విధానంతో ఇకపై తమ ఆటలు సాగవని, కొత్తగా ఎంపికైన ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు సిఫార్సు చేసిన కూటమి నాయకుల వద్ద వాపోతున్నట్లు తెలుస్తుంది. పని ప్రదేశంలో మొదటి ఫొటోను ఉదయం ఆరు గంటలకు తీసి, అప్‌లోడ్ చేస్తే ఆ తరువాత నాలుగు గంటలకు అనగా 10 గంటలకు ఫోన్‌లో ఆ ఫొటోను మరోసారి అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఆ తరువాత ఫొటోను అప్‌లోడ్ చేస్తేనే కూలీలకు నగదు చెల్లింపులు జరుగుతాయి. అలా కాకుండా ఫొటో అప్‌లోడ్ కాకపోతే ఆ రోజు కూలీలకు నగదు చెల్లింపులుండవు.

కూలీల పరిస్థితి అగమ్య గోచరం

ఉపాధి పథకంలో కూలీలుగా పని చేసే వారి పరిస్థితి ఈ కొత్త విధానంతో అగమ్య గోచరంగా మారే పరిస్థితి నెలకొంది. 3 నెలలుగా కూలీలకు నగదు చెల్లింపులు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం కూలీల నగదును విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పక్క దారి పట్టించి, నగదు చెల్లింపులు చేయలేదు. కొత్త విధానం నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో ముఖ ఆధారితంగానే నగదు చెల్లింపులు చేపట్టనున్నారు. ఇదే అమలు జరిగితే తమకు రావల్సిన 3 నెలల వేతనాలు ఎలా ఇస్తారని అధికారులను కూలీలు ప్రశ్నిస్తున్నారు.

మూడు నెలలుగా నగదు చెల్లింపు లేదు



మూడు నెలలుగా ఉపాధి పనికి క్రమం తప్పకుండా వస్తున్నా. మరో పది రోజుల్లో నాకు వంద రోజ లు పని పూర్తి అవుతుంది. ఇకపై పని ఉండదు. అలాంటి నాకు మూడు నెలలగా కూలీ డబ్బులు ఇవ్వ లేదు. అధికారులను అడిగితే నిధులు ఇంకా మంజూరు కాలేదని చెబుతున్నారు. కొత్తగా హాజరు వేసే విధానం వస్తే మాకు రావాల్సిన పాత బకాయిలు ఇస్తారో? లేదో తెలియడం లేదు. – కొండూరు వెంకటసుబ్బమ్మ, ఎగువరాజుపాళెం, చిల్లకూరు మండలం

ఇల్లు గడవడం కష్టంగా ఉంది



ఉపాధి పనికి వచ్చేది కూలీ డబ్బుల కోసమే. అలాంటిది మూడు నెలలుగా పనికి వస్తుంటే ఒక్క పైసా కూడా చెల్లించలేదు. ఇలా అయితే ఇల్లు గడవడం కష్టంగా మారుతుంది. కొత్త మస్టర్ వేయడం జరిగితే పాత పనులకు డబ్బులు వస్తాయా? అనే అనుమానం ఉంది. దీనిపై అధికారులను అడిగితే కొంత ఆలస్యం అవుతుందని అంటున్నారు. ఇప్పటికే మూడు నెలలు దాటుతుంది.. ఇంకా ఆలస్యం అయితే పనికి వచ్చే వారికి కష్టంగా ఉంటుంది. త్వరగా నగదు చెల్లింపులు చేయాలి. – వై. పోలమ్మ, బూదనం, చిల్లకూరు మండలం

కొత్త విధానంతో అవకతవకలకు చెక్

ఉపాధిలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా యాప్‌ను తీసుకుని వచ్చి దానిని అమలు చేసేలా ఈ నెల 8వ తేదీన ప్రారంభించనున్నాం. దీంతో ఉపాధి పని జరిగే చోట ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా ఉంటుంది. అలాగే కూలీలు ఒకరికి బదులు మరొకరు పని చేశారనే విమర్శలు ఉండవు. పని జరిగిన చోట కూడా నాలుగు దిక్కుల్లో ఫొటోలు తీయాల్సి ఉండడంతో అదే ప్రాంతంలో ఏడాది వరకు పని పెట్టేందుకు వీలు ఉండదు. కూలీలకు నగదు చెల్లింపులు త్వరగా చేపడతాం.

– శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ, తిరుపతి

దేశ సౌభాగ్యానికి కలలు కనండి



మాట్లాడుతున్న ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య



ఐసర్ స్నాతకోత్సవంలో పట్టాలు పొందిన విద్యార్థులతో ఆ విద్యాసంస్థ డైరెక్టర్ శాంతను భట్టాచార్య


ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశోధనలు చేయండి


- ఐసర్ ఆరో స్నాతకోత్సవంలో పట్టభద్రులకు ముఖ్యఅతిథి పిలుపు
- అట్టహాసంగా స్నాతకోత్సవ వేడుకలు
- 255 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం


ఏర్పేడు: 'ఇన్నాళ్లు తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టారు.. సైన్స్ ల్యాబ్‌ల్లో మెదడుకు పదును పెట్టి ఎన్నో ప్రయోగాలు చేశారు.. భావి శాస్త్రవేత్తలుగా బయటకు వెళుతున్న మీరంతా దేశ సౌభాగ్యం కోసం కలలు కనాలి. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లపై పరిశోధనలు చేసి, పరిష్కారాలను కనుగొనాలి.' అని గోదావరి బయో రిఫైనరీస్ చైర్మన్ సమీర్ సోమయ్య పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) ఆరో స్నాతకోత్సవం డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఐసర్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకను ఐసర్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఝిల్లుసింగ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 255 మంది విద్యార్థులను పట్టాలతో సత్కరించారు. పట్టాలు అందుకున్న వారిలో 22 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 8 మంది ఐపీహెచ్‌డీ విద్యార్థులు, ముగ్గురు ఎంఎస్ విద్యార్థులు, 141 మంది బీఎస్–ఎంఎస్ విద్యార్థులు, 69 మంది ప్రొఫెషనల్ మాస్టర్స్ విద్యార్థులు, ఆరుగురు బీఎస్ విద్యార్థులు, మరో ఆరుగురు బీఎస్సీ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులున్నారు. ముఖ్యఅతిథి గోదావరి బయోరిఫైనరీస్ లిమిటెడ్ చైర్మన్ సమీర్ సోమయ్య మాట్లాడుతూ భారతీయ వారసత్వం, శాస్త్రానికి సంబంధించి ధ్యానం చేయాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి మట్టి ఆధారిత వ్యవస్థ వైపు మారాలన్నారు. వ్యవసాయ రంగంతో కలిసి యువ శాస్త్రవేత్తలు పని చేయాలన్నారు. ప్రతి వ్యక్తి తొలుత తల్లి నుంచే బోలెడంత విజ్ఞానాన్ని నేర్చుకుంటారని, వినడం, వివేచన, సాధన ద్వారానే సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. మానవ జీవన విజ్ఞానంతోపాటు ప్రపంచంలోని అనేక జీవరాశులపై పరిశోధనలు చేయాలన్నారు. కాపీ ధోరణికి స్వస్తి పలికి, సొంత పరిజ్ఞానంతో పరిశోధనలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రకృతిని పరిరక్షించేలా పరిశోధనలు సాగాలని కోరారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఝిల్లుసింగ్ యాదవ్ మాట్లాడుతూ కర్బన ఉద్గారాల్లో గ్రీన్ కర్బనాలపై మరిన్ని పరిశోధనలు చేయాలని కోరారు. పలు రంగాల్లో ఎన్నో సవాళ్లు ప్రపంచ వైజ్ఞానిక విధానానికి పెనుసవాళ్లుగా కనిపిస్తున్నాయని, వాటి పరిష్కారాలను వెతికే రీతిలో పరిశోధనలు సాగాలన్నారు.

శాస్త్రీయ ప్రతిభ

2024–25లో 210 పరిశోధనా పత్రాలు ప్రచురించబడ్డాయన్నారు. రూ. 29.43 కోట్ల బహిరంగ పరిశోధన నిధులను పొందారని శాంతనుభట్టాచార్య వెల్లడించారు. నేచర్ ఇండెక్స్–2025 ప్రకారం తిరుపతి ఐసర్ దేశంలోనే 33వ స్థానంలో నిలిచిందన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన ప్రపంచ ఉత్తమ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో ఎనిమిది మంది ఐసర్ ఫ్యాకల్టీ సభ్యులు చోటుదక్కించుకోవడం తమకెంతో గర్వకారణమన్నారు. కోవిడ్ సమయంలో ఉచిత పరీక్షల నిర్వహణలో కీలక పాత్ర పోషించామన్నారు. కార్యక్రమంలో ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీ, లెఫ్ట్ కమాండర్ హిమాంశు శేఖర్, సీఎంఏ రమేష్ దామర్ల, వెంకట దీపక్, భానుశ్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







ఐసర్ స్నాతకోత్సవంలో ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, అతిథుల నుంచి పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

ఆవిష్కరణకు పునాదిగా ఐసర్

సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య మాట్లాడుతూ పరిశోధన, వైజ్ఞానిక ఆవిష్కరణలకు పునాది వేసేలా తిరుపతి ఐజర్‌ను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రత్యేక శిల్పకళతో తీర్చిదిద్దిన ఐసర్ గ్రిహా కౌన్సిల్, టెరీ 4 స్టార్ రేటింగ్ ఇచ్చాయన్నారు. గ్రంథాలయం, ఆడిటోరియం వంటి భవనాల్లో భారతీయ, విదేశీ ప్రముఖ శాస్త్రవేత్తల పేర్లు చెక్కి ఉండటం విశేషమన్నారు.

ఐసర్ విద్యా ప్రయాణం.. తీపి జ్ఞాపకం



ఐసర్ స్నాతకోత్సవ వేదికపై విద్యార్థుల నృత్యాలు

'వారంతా అత్యున్నత ప్రతిభావంతులు.. జాతీయ స్థాయి ప్రఖ్యాత సైన్స్ విద్యాసంస్థ తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్)లో సీటు సాధించి ఉన్నత విద్యను పూర్తి చేశారు. ఈ క్రమంలో తరగతి గదుల్లో పుస్తకాలతో దోస్తీ కట్టి మేథోమదనం చేశారు. సైన్స్ ల్యాబ్‌ల్లో నూతన ప్రయోగాలకు గట్టి బీజం వేశారు. తోటి విద్యార్థులతో చెలిమి చేసి గట్టి బంధాన్ని పదిలం చేసుకున్నారు..దేశంలోని వివిధ రాష్ట్రాలు, వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఐసర్ వేదికగా ఉన్నత చదువులు పూర్తి చేసుకుని, భావి శాస్త్రవేత్తలుగా దేశం గర్వించే పౌరులుగా తయారు కావడానికి సిద్ధమై డిగ్రీ పట్టాలను కన్న తల్లిదండ్రుల కళ్లెదుట ఆచార్యుల నుంచి అందుకుని... ఆనంద డోలికల్లో మునిగిపోయారు. ఆచార్యుల సూచనలతో స్ఫూర్తి నింపుకున్నారు. పట్టా చేతికొచ్చిన తరుణంలో సంతోష సాగరంలో మునిగారు. ఒళ్లు మరచి.. స్నేహితులతో కలసి స్టేజ్ పైకెక్కి హుషారైన సినీ గీతాలకు ఫుల్ జోష్‌తో నృత్యాలు చేశారు. ఐజర్ ప్రాంగణమంతా కలియతిరుగుతూ చివరి సెల్ఫీలు దిగుతూ ఆద్యంతం పట్టాభిషేకాన్ని ఆస్వాదిస్తూ స్నాతకోత్సవ శోభను ద్విగుణీకృతం చేశారు.



ఆనందోత్సాహాల్లో విద్యార్థినులు



సహచరులతో ఫొటోలు

క్లుప్తంగా

కార్వేటినగరంలో తొలిసారిగా వరలక్ష్మీవ్రతం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుతీరిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో తొలిసారిగా వరలక్ష్మీ వ్రతం ఈ నెల 8 తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు (ఇద్దరికి) రూ.500 చెల్లించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఆలయం వద్ద టికెట్లు పొందవచ్చు. వ్రతంలో పాల్గొన్న గృహస్తులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, అప్పం, బ్యాగ్, కుంకుమ, ప్రసాదం బహుమానంగా అందజేయనున్నారు.

6 నుంచి తెప్పోత్సవాలు

కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు 6వ తేదీన శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి, 7, 8వ తేదీల్లో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ మూడు రోజులు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఇసుక ట్రాక్టర్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రేణిగుంట: మండలంలోని ఎస్ఆర్ పట్టెడ సమీపంలోని స్వర్ణముఖినదిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తన సిబ్బందితో మంగళవారం తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి, రెవెన్యూ కార్యాలయానికి తరలించి, కేసు నమోదు చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ జయకృష్ణ, వీఆర్వో పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ పేరుతో నిషేధిత జాబితాలోకి శెట్టిపల్లి భూములు.. ఏడేళ్లుగా పరిష్కారం కాని సమస్య.. ఫలితం ఆగిన భూముల రిజిస్ట్రేషన్లు, జరగని క్రయ విక్రయాలు.. ఇళ్లు కట్టుకుని అనుభవించలేక..ఇటు రైతులు, అటు కొనుగోలుదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. తమకు న్యాయం జరగదని నిర్ధారించుకున్న వారు ఉద్యమబాట పట్టడానికి సన్నద్ధమతున్నారు.



టీడీపీ హయాంలో చంద్రబాబు నిషేధిత జాబితాలో చేర్చిన శెట్టిపల్లి భూములు

కూటమి చెలగాటం.. రైతులకు ప్రాణసంకటం

శెట్టిపల్లి భూముల వ్యవహారం తేలేదెన్నడో?

- శెట్టిపల్లి భూములను నిషేధిత జాబితాలోకి చేర్చిన ఘనత బాబుదే
- ఇప్పుడైనా సమస్య పరిష్కరించేనా?

తిరుపతి మంగళం : డెబ్బైఏళ్లకు పైగా అన్‌సెటిల్డ్ స్టేటస్‌లో ఉన్న శెట్టిపల్లి భూములపై రైతులకు, కొనుగోలుదార్లకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వం చేసిన ల్యాండ్ పూలింగ్ వ్యవహారం ఏడేళ్లుగా కొనసాగుతూనే ఉంది. టీడీపీ హయాంలో ప్రారంభమైన భూసేకరణ అంశం శెట్టిపల్లి రైతులు, కొనుగోలుదారులకు శాపంగా మారింది. గత ఎన్నికల్లో అధికారంలోకి తాము వస్తే తాము ప్రారంభించిన పని తామే పూర్తి చేస్తామని కూటమి నాయకులు హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం అవుతున్నా ఇప్పటికీ రైతులు, ఇళ్ల స్థలాల కొనుగోలుదార్లకు న్యాయం జరగలేదు.

నిషేధిత జాబితాలో చేర్చిన ఘనత బాబుదే

2018–2019 మధ్య కాలంలో అన్‌సెటిల్డ్ భూములుగా రికార్డుల్లో ఉన్న శెట్టిపల్లి భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో నిషేధిత జాబితాలోకి చేర్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుదే. ల్యాండ్ పూలింగ్ పేరుతో అక్కడ ఉన్న భూములను 40 శాతం లబ్ధిదారులకు, 60 శాతం అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకుని లేవుట్ల ద్వారా అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేసి ఇస్తామంటూ ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చి, రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆపించిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కుతుంది. ఆ తర్వాత శెట్టిపల్లి భూముల్లో క్రయ విక్రయాలు జరపలేక, కూలీనాలీ చేసుకుని ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు ఇళ్లు కట్టుకోలేక, ఇతరత్రా అవసరాల కోసం స్థలాలను విక్రయించుకునేందుకు వీలులేక అటు, రైతులు, ఇటు కొనుగోలుదారులు ఏడేళ్లుగా నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. శెట్టిపల్లి భూములపై నిషేధం విధించిన టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం అవుతున్నా శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇదిగో ఈ కేబినెట్‌లో పరిష్కరిస్తాం, వచ్చే కేబినెట్ సమావేశంలో పరిష్కరిస్తామంటూ అటు చంద్రబాబు, మంత్రులతో పాటు అధికారులు సైతం శెట్టిపల్లి రైతులు, కొనుగోలుదారులను మోసం చేస్తూనే వస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రొసీడింగ్స్‌తో భూహక్కు

టీడీపీ పాలనలో శెట్టిపల్లి భూములను రైతులు, స్థలాల కొనుగోలుదారులకు చెందకుండా అప్పటి సీఎం చంద్రబాబు నిషేధిత జాబితాలో చేర్చి, రిజిస్ట్రేషన్లను ఆపి, క్రయ విక్రయాలు జరగకుండా అడ్డుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సహకారంతో అప్పటి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఉన్న భూమన అభినయ్‌రెడ్డి శెట్టిపల్లి భూ సమస్యను తన భుజాలపైకి ఎత్తుకున్నారు. తుడాలో ఉన్న జీఓను కార్పొరేషన్‌కు మార్చి శెట్టిపల్లి పంచాయతీని తిరుపతి కార్పొరేషన్‌లోకి విలీనం చేశారు. అలాగే శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం కార్పొరేషన్ అధికారులతో కార్యాచరణ రూపొందించి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారు. శెట్టిపల్లి భూముల్లో పదుల సంఖ్యలో జేసీబీలు, ఇటాచీలను పెట్టి శుభ్రం చేయించారు. ప్రభుత్వం నుంచి శెట్టిపల్లి రైతులు, స్థలాల కొనుగోలుదారులకు వారి భూములపై పూర్తి హక్కు కల్పిస్తూ ప్రొసీడింగ్స్‌ను అందించిన ఘనత భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డికే దక్కుతుంది. శెట్టిపల్లి భూముల్లో లేఅవుట్లు వేసి అభివృద్ధి చేసి, లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించాలనుకున్న సమయానికి ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శెట్టిపల్లి భూ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.



శెట్టిపల్లి రైతులు, కొనుగోలుదారులకు భూహక్కు కల్పిస్తూ ప్రొసీడింగ్స్ అందజేసిన భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డిలు(ఫైల్)



శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరించాలని చంద్రబాబుకు విన్నవిస్తున్న రైతులు, కొనుగోలుదారులు(ఫైల్)

ఉద్యమబాటన శెట్టిపల్లి భూ బాధితులు

సమస్య పరిష్కారం కోసం బాధితులు అధికారులు, నాయకులు, మంత్రుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ గొంతులు పోయేలా మాకు న్యాయం చేయండంటూ తమ గోడు చెప్పుకుంటున్నారు. అయితే ఎవరి నుంచి ఎలాంటి హామీ లభించడం లేదు. ఇదిగో ఈ కేబినెట్ సమావేశంలో మీ సమస్య పరిష్కారం అవుతుంది. వచ్చే కేబినెట్ సమావేశంలో సీఎం మీ సమస్యపైనే నిర్ణయం తీసుకుంటారు. అంటూ భూ సమస్య పరిష్కారంపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం దాటవేస్తోంది. విసిగి వేసారిపోయిన బాధితులు ఉద్యమ బాటపట్టారు. కమ్యూనిస్టులు, ప్రజా సంఘాలను ఏకం చేసి నిరవధిక ఆందోళన చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

షీట్ ఉంటే రౌడీలుగా ముద్ర వేస్తారా?

సాక్షి టాస్క్‌ఫోర్స్: రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీట్ ఉన్నవారిని ప్రతివారం స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ సందర్భంగా షీట్ పేరుతో తమను అవమానిస్తున్నారని కొందరు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేర్లు చెబితే తమను మరింత ఇబ్బంది పెడతారని తమ ఆవేదన పంచుకున్నారు. 15 ఏళ్ల కిందట అప్పటి రాజకీయ నాయకుల ఒత్తిడితో తనపై తప్పుడు కేసు పెట్టారని, కేసు నిరూపణ కాకపోవడంతో న్యాయస్థానం కొట్టేసింది. కానీ ఆ కేసుతో అప్పుడు రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో తనపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. నాటి నుంచి ఎప్పుడు పడితే అప్పుడు పోలీస్ స్టేషన్‌కు పిలుస్తూ కౌన్సెలింగ్ పేరుతో తీవ్రంగా పోలీసులు అవమానిస్తున్నారు. తాను ఊరు విడిచి వెళ్లలేను.. ప్రస్తుతం ఇక్కడ బతకలేని పరిస్థితిని పోలీసులు తీసుకుని వస్తున్నారు. వారానికి ఒకసారి కౌన్సెలింగ్ పేరుతో పోలీస్ స్టేషన్‌కు పిలుస్తూ స్టేషన్ బయట రోడ్డుపైన జనాల మధ్యలో షీట్ ఓపెన్ అయిన అందరినీ నిలపెట్టి పత్రికా విలేకరులను పిలిచి, పోలీసుల పబ్లిసిటీ కోసం మమ్మల్ని వాడుకుంటున్నారు. రౌడీ షీటర్‌ను తాట తీస్తానన్న సీఐ, తప్పు చేస్తే ఖబడ్దార్, రౌడీ షీటర్లు మారాలి, అంటూ వారానికి ఒక హెడ్డింగ్ పెడుతూ మా ఫొటోలను వివిధ పత్రికల్లో వేస్తున్నారు. ఇలా సొంతూరులో అవమానం భరించే కన్నా ఎటైనా వెళ్లిపోవాలనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న అర్బన్ సీఐ వ్యవహరిస్తున్న తీరుతో తనలాంటి అనేకమంది షీట్ ఉన్నవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. షీట్ ఉండి తప్పులు చేస్తున్న వారిని వారానికి ఒకసారి పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడంలో తప్పు లేదు కానీ ఏదో తప్పుడు కేసు కారణంగా షీట్ ఓపెన్ చేసి సంవత్సరాలుగా ఇలా అవమాన పడడం తన లాంటి అనేకమందికి జరుగుతోంది. కౌన్సెలింగ్ అంటే కనీసం నాలుగు గోడల మధ్య పోలీసులు ఇవ్వచ్చు గానీ ఇలా సొంత ఊర్లో అందరి ముందు పత్రికా విలేకరులను పిలిచి ప్రతివారం తమ ఫొటోలు, వీడియోలు తీస్తూ ఇలా మమ్మల్ని పోలీసులే వీళ్లు రౌడీలు అని ముద్ర వేయటం దారుణంగా ఉంది. ఇతర పోలీస్‌స్టేషన్‌లో ఇలా జరుగుతుందో లేదో తెలియదు గానీ రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ప్రతివారం ఇలాగే షీట్ ఉన్న వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి, తగిన సూచనలు ఇవ్వకపోతే, తనలాంటి అనేకమంది ఊరు విడిచి వెళ్లిపోవడం లేదా ఇతర అఘాయిత్యాలు చేసుకోవడం తప్ప ఇతర దారి కనిపించ లేదని ఆవేదన చెందుతున్నారు.

మట్టి వినాయక విగ్రహాలకే అనుమతి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, తిరుపతి కమిషనర్, ఎమ్మెల్యే, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు

తిరుపతి అర్బన్: వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని.. అయితే మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడానికి మాత్రమే అనుమతి ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం తిరుపతి నగర వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లపై అధికారులు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతిలో టీటీడీ సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్ వారు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భారీ విగ్రహాలను ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. నిమజ్జనం రోజు మత్స్యశాఖ వారు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోలాటం, భజన కార్యక్రమాలతోపాటు భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు.వినాయకసాగర్, దామినేడు వద్ద నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ అగ్నిమాపక, విద్యుత్, పోలీస్, మున్సిపల్ అధికారులు ఒకే వేదికపై కూర్చునేలా ఏర్పాట్లతో పర్మిషన్లు త్వరితగతిన ఇచ్చేలా చూడాలని వెల్లడించారు. మద్యం సేవించకూడదని, మందిరాల వద్ద భక్తి పాటలు మాత్రమే పెట్టాలని ఆదేశించారు. వివాదాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 50 అడుగుల భారీ నాట్య వినాయకుని విగ్రహాన్ని వినాయక సాగర్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీఓలు భానుప్రకాష్, కిరణ్మయి, రాఘవేంద్ర మీనా, అదనపు ఎస్పీ రవి మనోహర ఆచారి, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, మహోత్సవ కమిటీ సభ్యుడు భానుప్రకాష్, తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేతనాలు, పింఛన్లు చెల్లించలేని స్థితిలో సర్కార్

- 'రండి, టీ తాగుతూ మాట్లాడుకుందాం'

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర సర్కార్ ఉందని ఏపీజీఈఏ రాష్ట్ర నేతలు లక్ష్మీపతి, శ్యామ్‌కుమార్, బాలాజీరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు మండిపడ్డారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు తిరుపతి నగరంలోని ఏపీఎన్‌జీఓ కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక బాండ్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయింపుతోపాటు నిర్మాణాలు చేయించాలని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను స్పష్టంగా ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉందని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బరాయుడు, వీఆర్వోల సంఘం నాయకుడు చెంగల్ రాయల్, ఏఎస్‌ఓ మధు, నేతలు కిరణ్, దుర్గాప్రసాద్, అరుణమ్మ, మాధవరావు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మఠం భూముల జోలికి వస్తే క్రిమినల్ కేసులు



భూ ఆక్రమణ దారులతో మాట్లాడుతున్న హథీరాంజీ మఠం సూపరింటెండెంట్ కేశవులు

తిరుపతి రూరల్: మండలంలోని గాంధీపురం పంచాయతీ అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 13 లోని హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు తప్పవని మఠం సూపరింటెండెంట్ కేశవులు హెచ్చరించారు. మంగళవారం ఆయన మఠం భూముల్లో కడుతున్న అక్రమ కట్టడాలను పరిశీలించి, ఆక్రమణదారులతో చర్చించారు. అసలు మఠం భూముల్లో ఇళ్లు కట్టే అధికారం ఎవరిచ్చారని ఆరా తీయగా తమకు రిజిస్ట్రేషన్లు జరిగాయని చెప్పడంతో ఆ సర్వే నంబర్‌లో ఎక్కడా రిజిస్ట్రేషన్లు జరగలేదని తేల్చి చెప్పారు. తప్పుడు రిజిస్ట్రేషన్లు, నకిలీ పత్రాలు చేత పట్టుకుని రూ.కోట్ల విలువైన మఠం భూములు కాజేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. మఠం భూముల్లో గొడవలు జరిగితే అందరిపైనా పోలీసులు కేసులు పెడతామని హెచ్చరించారు. ఆయన ల్యాండ్స్ క్లర్క్ సీతారామయ్య, ఉన్నారు.

కల్వర్టును ఢీకొన్న ఇన్నోవా

- కారు డ్రైవర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి
- అమెరికా నుంచి తిరుపతికి వస్తుండగా ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని లేమ



కారు డ్రైవర్ రాజేష్ మృతదేహం



కల్వర్టును ఢీకొన్న ఇన్నోవా

చంద్రగిరి: కారు కల్వర్టును ఢీకొనడంతో అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినితోపాటు కారు డ్రైవర్ మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట రహదారిలోని ఐతేపల్లి సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి కరకంబాడి మార్గంలోని కూరపాటి రామచంద్రనగర్‌కు చెందిన లేమ(34), ఆమె భర్త కార్తీక్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. అమెరికా నుంచి తిరుపతికి బయలుదేరారు. సోమవారం అర్ధరాత్రి బెంగళూరులోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి బెంగళూరుకు చెందిన ఇన్నోవా కారును అద్దెకు తీసుకుని తిరుపతికి వస్తుండగా ప్రమాదం జరిగింది.

కుక్క రూపంలో కబళించిన మృత్యువు

బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతికి వస్తున్న దంపతులను కుక్క రూపంలో కబళించింది. కారు ఐతేపల్లి సమీపంలోని క్యాండర్ స్కూల్ వద్ద వస్తుండగా రోడ్డుకు అడ్డంగా కుక్క వచ్చింది. దీంతో కారు డ్రైవర్ రాజేష్(44) కుక్కను తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. లేమకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె భర్త కార్తీక్ 108కు సమాచారం అందించారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలు లేమను హుటాహుటిన 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ మురళీ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి పెళ్లి కోసం వస్తూ పరలోకాలకు వెళ్లావా.. తల్లీ!

ఈ నెల 13వ తేదీన తన తమ్ముడి వివాహం ఉన్న నేపథ్యంలో తిరుపతికి వస్తూ తిరుగురాని లోకాలకు వెళ్లిపోయావా.. తల్లీ అంటూ బంధువుల రోదనలను మిన్నంటాయి. మార్చురీ వద్దకు చేరుకున్న బంధువులు లేమ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. శుభ కార్యం జరగాల్సిన ఇంట ఇలా విషాద ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు సైతం ఆవేదన వ్యక్తం చేశారు.

జ్ఞాన పరంపరకు మూలం సంస్కృతం



ఉత్తరాఖండ్ సీఎం, ఒడిశా గవర్నర్‌ను జ్ఞాపికతో సన్మానిస్తున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: భారతీయ జ్ఞానపరంపరకు మూలం సంస్కృతమని, దేవభాష అధ్యయనంతో మానవ జీవితం ధన్యమైనట్టేనని వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన భాషోత్సవ జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, ఒడిశా గవర్నర్ డాక్టర్ కే హరిబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వర్సిటీలో హెరిటేజ్ కారిడార్‌లో నూతనంగా నిర్మించిన శ్రీస్వామి నారాయణ సంప్రదాయ అక్షర పురుషోత్తమ ఆలయాన్ని అతిథులు ప్రారంభించారు. అనంతరం శ్రీజగన్నాథ మందిరంలో పూజలు చేసి, వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో వారు ప్రసంగించారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ సాధు భద్రేశదాస్ స్వామి, వేదిక్ వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, శ్రీపరమాచార్య గురుకుల కేంద్రం డైరెక్టర్ గణపతిభట్, థింక్ ఇండియా కౌన్సిల్ మెంబర్ సౌరవ్ పాండే, ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పండా, ఉత్తరాఖండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ కె రుహెల్లా, పీఆర్ఓ ప్రొఫెసర్ రమేష్ బాబు, ఏపీఆర్ఓ కనపాల కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



మునెయ్య మృతదేహం(ఇన్‌సెట్) మునెయ్య(ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని నందిమాల గ్రామానికి చెందిన పేరువాయి మునెయ్య(55) అనే రైతు మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. నందిమాల గ్రామానికి చెందిన మునెయ్య పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు పోయాయి. దీంతో సరఫరా ఆగిపోయింది. ఫ్యూజ్ కాలిపోయిన విషయం గ్రహించిన మునెయ్య కర్ర సాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజు వేసే ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని గ్రామంలోని అతని నివాసానికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య జయలక్ష్మి, కూమార్తె చైతన్య,కుమారుడు శశికుమార్ ఉన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



పాకాల: ప్రయాణిస్తున్న రైలు నుంచి మహిళ జారి పడి మృతి చెందిన సంఘటన దామలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు.. టీటీపల్లి పంచాయతీ, వలపలవారిపల్లి సమీపంలో మంగళవారం రైలు నుంచి జారి పడి సుమారు 45 ఏళ్ల మహిళ మృతి చెందింది. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఆమె చేతిపైన రామక్క, పార్వతి అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కదిరి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలలో పోషకాలు మెండు



ఉత్తమ తల్లిదండ్రులకు బహుమతులను అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తల్లిపాలలో బిడ్డలకు పోషకాలు మెండుగా లభిస్తాయని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున తల్లిపాలతో కలిగే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ వసంత బాయి, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, డీఐఓ శాంతకుమారి, టాటా ట్రస్ట్ సీనియర్ మేనేజర్ సుబ్రమణ్యం, మహిళా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆరు నెలలు పాటు తల్లిపాలు ఇవ్వడం, ఆ తర్వాత అనుబంధ ఆహారాలు తీసుకోవడంలో తప్పకుండా నిబంధనలు పాటించిన ఉత్తమ తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు.

ఉపాధి..అంతా అవినీతిమయం



సామాజిక తనిఖీ బహిరంగ సభలో పాల్గొన్న అధికారులు

రామచంద్రాపురం: ఉపాధి హామి పథకం అవినీతిమయంగా మారింది. ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీల్లో రూ.లక్షల అవినీతి జరిగినట్లు ప్రత్యేక సిబ్బంది గుర్తించారు. అయితే ఇందుకు సంబంధించి అధికారులను సస్పెండ్ చేయడమే తప్ప, అవినీతికి పాల్పడిన ఫీల్డు అసిస్టెంట్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.12.60 కోట్ల నిధులతో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి మంగళవారం మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ శాఖ జిల్లా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీఓ ఇందిర, ఏపీడీలు చిన్నరెడ్డెప్ప, పార్వతీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 23 పంచాయతీల్లో జరిగిన పనులపై సీఆర్పీ సిబ్బంది నివేదికను చదివి వినిపించారు. మండలంలోని 23 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.32 వేల రికవరీ, రూ.1.97లక్షలు జరిమానా విధించడం జరిగిందని, వారి నుంచి నగదును రికవరీ చేయాలంటూ పీడీ ఆదేశించారు. అలాగే జూనియర్ ఇంజినీర్ మమత, టీఏ సుదర్శన్, బేర్‌ఫుట్ ఇంజినీర్ రమేష్‌లు విధుల్లో అలసత్వం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను తనిఖీలను చేయడంలో నిర్లక్ష్యం వహించారంటూ వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అవినీతి పరులపై చర్యలు శూన్యం

మండలంలోని ఓ పంచాయతీలో సుమారు రూ.17 లక్షలు అప్పనంగా కాజేశారని బహిరంగ సభ సాక్షిగా అధికారులు తేల్చారు. మరో పంచాయతీలో సుమారు రూ.10 లక్షలకు పైగా నొక్కేశారు. మండల కేంద్రానికి సమీపంలోని మరో పంచాయతీలో ఏకంగా మస్టర్లనే తారుమారు చేసి రూ.15 లక్షల దొంగబిల్లులు పెట్టినట్లుగా తెలుస్తోంది. అయితే మండల బహిరంగ సభలో ఈ అవినీతిని వెలికి తీస్తారని ఎంతో ఆశగా ఎదురు చూసిన ప్రజలకు, ఉపాధి కూలీలకు నిరాశ ఎదురైంది.